కడ్తాల్ : తలకొండపల్లి మండల కేంద్రంలో గొర్ల పోచమ్మ, సాడమ్మ బోనాల ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఖానాపూర్‌లో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

ఇబ్రహీంపట్నం, మే 26 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్తులంతా ఉదయం నుంచే బొడ్రాయికి బోనాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి ఖానాపూర్ గ్రామానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ మహిపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కౌన్సిలర్ శంకరయ్య, ఉప్పరిగూడ సహకార సంఘం అధ్యక్షుడు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

యాచారం : ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండలంలోని గున్‌గల్ గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ, గంగాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్దమ్మ తల్లి, గంగాదేవి ఆలయాల్లో ఆయన పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సతయ్య, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకులు మచ్చ లక్ష్మణ్, గిరమోని భిక్షపతి తదితరులున్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మే 26 : పేద ప్రజలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని కడ్తాల్ జడ్పీటీసీ, ట్రస్టు చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామానికి చెందిన నేనావత్ జేమ్లానాయక్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ ఆదివారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి జేమ్లానాయక్ మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలు, ఎంపీటీసీ ప్రియ రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీపంతూనాయక్, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు శంకర్‌నాయక్, రమేశ్‌నాయక్, లాయక్‌అలీ, జగన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జగన్

మంచాల, మే 26 : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ అన్నారు. ఆదివారం మంచాల మండలం లోయపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీల తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంటనే కూలీలకు ప్రతి రోజూ 300 రూపాయల కూలీ డబ్బులు పడేవిధంగా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో బొట్టు జాని, ఇరుముల వెంకటయ్య, మహేందర్, గంపెల్లి రాజు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి రూ. 9 లక్షల విరాళం

గ్రామ పెద్దలకు విరాళాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు మొర్ర క్రాంతిరెడ్డి

కొత్తూరు, మే 26: మున్సిపాలిటీలో నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొర్ర క్రాంతిరెడ్డి రూ. 9 లక్షల విరాళాన్ని అందజేశారు. గ్రామ పెద్దలకు ఈ భారీ విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకర్గంలో ఏ గుడి నిర్మించినా సహాయాన్ని అందజేస్తున్నానని చెప్పారు. మున్సిపాలిటీలో గ్రామ దేవతల ఆలయాలను త్వరగా పూర్తి కావాలని ఆక్షాంక్షించారు. ఆయనతో పాటు కొత్తూరు ఎంపీటీసీ సత్యమ్మ కుమారుడు ఇందూరు శ్రీనివాస్ రూ.2,21,000, బీఆర్ఎస్ యువ నాయకుడు శివచారి రూ. 1,11,000 విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయుకుడు దేవేందర్‌యాదవ్, గ్రామ పెద్దలు సదానందంగౌడ్, కౌన్సిలర్ నర్సింహాగౌడ్, బ్యాగరి యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, బండి కృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటా-2024 మహాసభలకు లక్ష్మీనర్సింహారెడ్డి

లక్ష్మీనర్సింహారెడ్డి, కడ్తాల్ మాజీ సర్పంచ్

కడ్తాల్, మే 26 : అమెరికాలో ప్రవాస భారతీయులు రెండేండ్లకోసారి నిర్వహించే ఆటా-2024 మహాసభలకు కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డికి ఆహ్వానం అందింది. సేవా కార్యక్రమాల్లో భాగంగా 2019 సంవత్సరంలో ఆటా-2020 వేడుకలకు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రీమియర్ స్పాన్సర్‌గా వ్యవహరించి... ప్రవాస భారతీయుడు, అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి గూడూరు కిశోర్ ద్వారా మండల కేంద్రంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. 2019, 2021, 2023 సంవత్సరాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు, మంచి నీటి సౌకర్యాలు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, కరోనా సమయంలో మెడికల్ కిట్లు, నిరుపేదలకు వృత్తి పరమైన పనిముట్లు, ప్రమాదాల నివారణకు బారికేడ్లు అందజేశారు. నవత, యువత, భవిత అనే నినాదంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించారు. ఈ మేరకు సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన లక్ష్మీనర్సింహారెడ్డికి అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జూన్ 7, 8, 9 తేదీల్లో అమెరికాలోని అట్లాంటా రాష్ట్రం జార్జియా నగరంలో జరుగనున్న18వ తెలుగు యూత్ కన్వెన్షన్‌కు ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు.

సాగుకు సన్నద్ధం

- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు
- వానకాలం వ్యవసాయ పనుల్లో బిజీగా రైతులు

పటేల్‌చెర్వుతండాలో విత్తనాలు వేస్తున్న రైతులు

మంచాల, మే 26 : ఖరీఫ్‌లో పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఈ మేరకు రైతులు పొలాల్లో దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల వర్షాలు కురవడంతో.. రైతులు వానకాలం వ్యవసాయ పనులను ప్రారంభించారు. సన్నా చిన్నాకారు రైతులు నాగళ్లు, ట్రాక్టర్లతో పొలం బాటపడుతున్నారు. రైతులకు తోడుగా మహిళలు తమ పొలంలో చెత్తాచెదారాన్ని, ముండ్ల కంపలను తొలగించి వాటిని కాల్చివేస్తున్నారు. మండలంలోని ఆరుట్ల, మంచాల, జాపాల, నోముల, లింగంపల్లితో పాటు పలు గ్రామాల్లో ఎక్కువగా పత్తివేసే రైతులు దుక్కుల్లో ఎరువులు చల్లి దుక్కులు దున్నిస్తున్నారు. అదేవిధంగా రంగాపూర్ నుంచి లోయపల్లి వరకు ఎక్కువగా రైతులు వరి వైపు మొగ్గు చూపుతున్నారు. ఆ రైతులు తమ పొలాల్లో తుకం పోసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్నారు. భారీ వర్షాలు కురియగానే మరో మారు దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. అన్నదాతలకు ఎరువులు, విత్తనాల సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతిశ్రీ తెలిపారు.

మంగళ సూత్రం కొట్టేశారు!

- నడుచుకుంటూ వచ్చి చైన్ స్నాచింగ్
- చెట్ల పొదల్లోకి పరారైన దుండగులు
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఉమర్‌ఖాన్‌గూడలో ఘటన

చైన్ స్నాచింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి

పెద్దఅంబర్‌పేట, మే 26: మండల పరిధిలో చైన్ స్నాచింగ్ దుండగులు రెచ్చిపోయారు. నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోనుంచి మంగళసూత్రం తెంపుకెళ్లారు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉమర్‌ఖాన్‌గూడకు చెందిన అనంతలక్ష్మి స్థానికంగా కిరాణా దుకాణం నడుపుతున్నది. ఎప్పటిలాగానే శనివారం రాత్రి 8.30 గంటల తర్వాత దుకాణం మూసివేసి ఇంటికి బయలుదేరింది. రోడ్డుపై వెళ్తుండగా.. వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోని 3 తులాల మంగళసూత్రాన్ని తెంపుకొని పక్కనున్న చెట్ల పొదల్లోకి పరారయ్యారు. గమనించిన స్థానికులు వెంటపడి వెతికినా ఆచూకీ లభించలేదు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ఘటనాస్థలిని పరిశీలించారు. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కల్పన(ఫైల్)

మొయినాబాద్, మే 26 : వరకట్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానిక పీఎస్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. జిల్లాలోని కడ్తాల్ గ్రామానికి చెందిన నార్లకంటి మల్లేశ్‌కు ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురు కల్పన(22) బాసరలోని ట్రిపుల్ ఐటీలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నది. జిల్లాలోని చౌదర్‌గూడం మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామానికి చెందిన బైరంపల్లి శ్రీశైలం తమ కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ఆసీఫ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కల్పన, శ్రీశైలం కొంత కాలంగా ప్రేమించుకుని గతేడాది అక్టోబర్ 29వ తేదీన ఆర్యసమాజ్‌లో వివాహం చేసుకున్నారు. ఈ విషయం ఇరు కుటుంబాల పెద్దలకు తెలియడంతో.. ఇరు కుటుంబాలు వారి ప్రేమ వివాహాన్ని అంగీకరించి పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరి 11న వివాహం చేశారు. వారిద్దరు బతుకుదెరువు కోసం మొయినాబాద్ మండలానికి వలస వచ్చి హిమాయత్‌నగర్ గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. జీవనోపాధి కోసం భర్త శ్రీశైలం హిమాయత్ నగర్‌లోనే టీ-పాయింట్ నిర్వహిస్తున్నాడు. కొన్ని నెలల పాటు వారి కాపురం సాఫీగానే సాగింది. భర్త శ్రీశైలానికి కల్పనపై అనుమానం రావడంతో శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. శ్రీశైలం తన తల్లి స్వరూప, బాబాయి రాజుతో కలిసి అదనపు కట్నం కింద స్విఫ్టు కారు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. వారి వేధింపులను భరించలేక కల్పన శనివారం రాత్రి బెడ్‌రూంలో చున్నితో ఉరి వేసుకుంది. తన భార్య ఆత్మహత్య చేసుకుందని శ్రీశైలం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో..సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలను సేకరించారు. తన కూతురు ఆత్మహత్య చేసుకోవడానికి భర్త, తల్లి, బాబాయి వేధింపులే కారణమని తండ్రి మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొత్తూరు, మే 26: 11 కేవీ ఫీడర్ పరిధిలోని లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగించేందుకు కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటలకు విద్యుత్ పరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీ, కుమ్మరిగూడ, స్టేషన్ తిమ్మాపూర్, ఫాతిమాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

వెండి తొడుగులు బహూకరణ

షాద్‌నగర్‌టౌన్, మే 26: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలోని గణపతి దేవాలయానికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన వాసవీక్లబ్ జోన్ చైర్మన్ నవీన్‌కుమార్ దంపతులు ఆదివారం 45 తులాలతో చేయించిన వెండి చెవి తొడుగులను అందజేశారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న అనంతరం అర్చకుడు సునీల్‌కు వెండి తొడుగులను అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, వాసవీక్లబ్ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ సురేశ్, సభ్యులు వెంకటరమణ, రాజేశ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

యాచారం, మే 26: ప్రత్యేకాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జడ్పీటీసీ జంగమ్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిన తరువాత గ్రామాల్లో ప్రజలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. తాగునీరు సరఫరా సక్రమంగా లేకపోవడంతో తాగునీటి ఎద్దడి, చెత్త సేకరణ సకాలంలో చేయకపోవడం పారిశుధ్య సమస్యలు, వీధులు అపరిశుభ్రంగా ఉండటం తదితర సమస్యలు తలెత్తుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె కోరారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి

మంగళ్‌పల్లిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిబట్ల, మే 26 : క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామాల్లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహబంధాలు పెరుగుతాయన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమే గెలుపునకు నాంది అని అన్నారు. క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహిపాల్, డీసీసీబీ జిల్లా చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిలర్ దాసు, నాయకులు గురునాథ్‌రెడ్డి, పల్లె రజినీకాంత్‌గౌడ్, కొత్తకుర్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

షాద్‌నగర్‌రూరల్ : యువత చదువుతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని బూర్గుల గ్రామంలో 25 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌కు ఆయన హాజరై విజేతకు ట్రోఫీని అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఫైనల్ మ్యాచ్ విజేత బూర్గుల సీనియర్ టీంకు ప్రథమ బహుమతిగా ట్రోఫీతో పాటు రూ.80 వేల నగదు, రెండవ బహుమతి తిర్మలగిరి టీంకు రూ.40వేలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణాశివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన టీంకు ట్రోఫీతో పాటు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కార్యాలయ ఏర్పాటుకు తోడ్పాటునందించండి

ఆర్డీవో కార్యాలయ ఏర్పాటుకు సహకరించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, బీఆర్ఎస్ యువజన నాయకులు డేరంగుల వెంకటేశ్, గణేశ్ ఉన్నారు.

ఆమనగల్లు, మే 26

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న స్నేహితులు

చేవెళ్ల రూరల్, మే 26 : చేవెళ్ల మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీకాంత్ 10వ తరగతి చదివాడు. విషయం తెలుసుకున్న ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు అందరూ కలిసి శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు రూ.35 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

షాబాద్, మే 26 : షాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-1988 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆన్‌మోల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. ఒక్కొక్కరూ ఒక్కో రంగంలో స్థిరపడ్డామని చెప్పడంతో గురువులు వారిని అభినందించారు. తమ బ్యాచ్‌లో ఉన్న వారంతా కలిసి ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని ఎవరైనాఆ తమ బ్యాచ్‌కు చెందిన వారు మరణిస్తే వారికి ఆర్థిక సహాయం చేయాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు జడల వీరస్వామిగౌడ్, యాదగిరిచారి, లింగం, పూర్వ విద్యార్థులు కుమ్మరి యాదగిరి, కాట్న సత్యనారాయణ, కమ్మరి శ్రీనివాస్, ముత్యం, యాదయ్య, బస్వరాజ్, కోట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ ఉన్నత పాఠశాలలో 2005-2006లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని జేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో అనాటి ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, బలవంత రెడ్డి, కృష్ణస్వామి, ఇంద్రాదేవి, సుజాత, అనురాధ, నిర్మల, కాంతారత్నం, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : మండలంలోని కనకమామిడి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2002-03లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారందరూ ఒకచోట చేరి చిన్న నాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్య క్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, డాక్టర్ చంద్రశేఖర్, మహేందర్, అశోక్‌గౌడ్, పాషా, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, రవీందర్, భాస్కర్‌రావు, విక్రమ్, శేఖర్, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో ..

షాబాద్ ఆన్‌మోల్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుర్కయాంజాల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు